క్లుప్తంగా

రేపు మైనార్టీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు

కేటీదొడ్డి: ఈ నెల 12న మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ మహమ్మద్ అజార్ మోహిద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మాచర్ల, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గట్టు ఏపీజీవీబీ ధరూర్, ఇండియన్ బ్యాంక్ వెంకటాపురం శాఖల ఆధ్వర్యంలో మొత్తం 40 దరఖాస్తుదారులకు ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్యూవ్యులు ఉంటాయని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, పాన్‌కార్డులు, రేషన్‌కార్డు, పాసుబుక్, ఆదాయం, కులం ధ్రువపత్రాలతో పాటు రెండు పాసు ఫొటోలను తీసుకురావాలని కోరారు.

మాచర్ల తైబజార్ వేలం



గట్టు: మండలంలోని మాచర్లలో సోమవారం తైబజార్ వేలం పాటను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పోటీలో పాల్గొనేందుకు ఆసక్తి కనబరిచారు. ఏడాది కాలానికి సంబంధించి వారాంతపు సంతను గ్రామానికి చెందిన హనీఫ్ అనే వ్యక్తి రూ.లక్షా 41 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేష్, సర్పంచు సిద్దిరామప్ప, కార్యదర్శి ప్రదీప్, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. పవిత్ర కృష్ణానదిలో స్నానాలు చేశారు. శివలింగానికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అలంపూర్ రూరల్: మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన భీమన్న గుండెపోటుతో మృతిచెందాడు విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ యువజన నాయకుడు ఆర్ కిషోర్ సోమవారం గ్రామానికి చేరుకొని భీమన్న మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్థికసాయం అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ భర్త శేఖర్, మాజీ సర్పంచ్ తిరుపాల్, తదితర నాయకులు ఉన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన



శాంతినగర్: వడ్డేపల్లి మండలం జక్కిరెడ్డిపల్లి అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీదేవమ్మ ఆధ్వర్యంలో సోమవారం పంట పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా కూలీలకు, గొర్రెల కాపరులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. చిరు ధాన్యాలతో తయారుచేసిన ఆహారం తీసుకుంటే షుగర్ వ్యాధులు రావని, ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు.

మొబైల్ ఫోన్స్ అందజేత



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కోదండాపురం పీఎస్ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఇటీవల మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్నారు. ఎస్సై వెంకటస్వామి ఆధ్వర్యంలో ట్రేస్ చేసి రికవరీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం బాధితులకు పోలీస్ సిబ్బంది ఫోన్లను అందజేశారు. అనంతరం పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణ సంస్కృతిని కాపాడుకుందాం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

శాంతినగర్: గ్రామీణ సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకుందామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం వడ్డేపల్లి మండలంలోని తనగలలో గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పర్వదిన వేడుకల్లో భాగంగా ఏర్పాటుచేసిన బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతుల ఐకమత్యానికి పోటీలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. అనంతరం పోటీలను తిలకించి రైతులను ఉత్సాహపరిచారు. అంతకు ముందు గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. 200 మంది విద్యార్థులకు ఒకే మరుగుదొడ్డి ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ఊరు మన బడి నిధులు ఏం చేస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పాఠశాల గదిలో కూర్చుని విద్యార్థుల సామర్థ్యాలను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు.

బీఎస్పీని ఆదరించాలి

బహుజనుల రాజ్యం కోసం బీఎస్పీని ఆదరించాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గ్రామంలో సాయంత్రం రాజ్యాధికార యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో అవినీతి కుటుంబ పాలన చరమగీతం పాడుదామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధుగౌడ్, ప్రధాన కార్యదర్శి రవిచందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

అయిజ: పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందికంటి విజయకుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో అలంపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధు గౌడ్ ఆధ్వర్యంలో మండల, మున్సిపాలిటీలకు సంబంధించిన నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా తిమ్మరాజు గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షుడిగా రాజు ఎంపికయ్యారు. అనంతరం నియామక పత్రాలను అందజేశారు. బీఎస్పీ ఎంజెడాను ప్రజలకు వివరించాలని నూతన కమిటీ సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కేశవరావు, మహిళా కన్వీనర్ నాగజ్యోతి, స్వామిదాసు, రాజారత్నం, హనుమన్న, చిన్న, రవి తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రాలు అందజేస్తున్న మధు గౌడ్

ఏసు క్రీస్తు బోధనలు ఆచరణీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు: ఏసు క్రీస్తు బోధనలు ఆచరణీయమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని మార్లబీడు ఎంబీ హెర్మోను చర్చిలో ఈస్టర్ పండుగను పురస్కరించుకుని పాస్టర్ ఆన్డ్రూస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రేమ, శాంతికి ప్రతిరూపం ఏసు క్రీస్తు అని పేర్కొన్నారు. సాటి మనుషుల పట్ల దేవుడు పంచిన ప్రేమను అందరూ పాటించాలని సూచించారు. గద్వాల నియోజవర్గంలో క్రైస్తవులు వివాహాలు, ఇతర శుభ కార్యాల కోసం కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. గ్రామంలో నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత శ్రీరాములు, నాయకులు ప్రభాకర్‌గౌడ్, సంఘ పెద్దలు చిన్న కర్రెప్ప, దేవదాసు, సాంసోను, ఆనందం, మారెప్ప, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఉండవెల్లి: మండలంలోని మెన్నిపాడులో ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి పరిశీలించారు. సోమవారం మెన్నిపాడులో ఆర్డీఎస్ కెనాల్ అనుసంధానంలో భాగంగా చిన్న కాలువలను నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పనులను త్వరగా పూర్తి చేయించి ఎండ తీవ్రతకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

వనపర్తి క్రైం: పేపర్ లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి వెళ్తున్న యువజన కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టెన్త్ పేపర్ లికేజీ విషయంలో పెద్దల హస్తం ఉందని, కేసీఆర్ నియంత పాలనకు స్వస్తి పలికి.. ప్రజల వద్దకు పాలన రావాలని వారు పిలుపునిచ్చారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధి విష్ణువర్ధన్‌రెడ్డి, అసెంబ్లీ అధ్యక్షుడు ఆవుల రమేష్, మండల యువజన అధ్యక్షుడు రొయ్యల రమేష్, చిన్నగౌడ్, మల్లేష్ తదితరులు ఉన్నారు.



అరెస్టయిన యూత్ కాంగ్రెస్ నాయకులు

ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్



మాక్‌పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్

అలంపూర్: పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో విద్యార్థులు ఆదివారం రాత్రి మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పార్లమెంట్ సభ్యులుగా వ్యవహరించారు. స్పీకర్, ప్రధానమంత్రి, ఇతర మంత్రి వర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసి ఆకట్టుకున్నారు. మాక్ పార్లమెంట్‌లో ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నోత్తరాల సమయంలో వివిధ సమస్యలను ప్రస్తావించారు. మాక్ ప్రభుత్వ, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాదనలు వాడీవేడిగా కొనసాగాయి. ప్రతి పక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికార పక్ష సభ్యులు దీటుగా సమాధానాలు ఇచ్చారు. సంతృప్తి చెందని ప్రతిపక్ష సభ్యులు కొందరు వాకౌట్ చేశారు. మాక్ పార్లమెంట్ నిర్వాహణ చూపరులను ఆకట్టుకుంది. మాక్ పార్లమెంట్‌ను అద్భుతంగా నిర్వహించిన ఉపాధ్యాయులు, విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ కేఎస్‌వీ రవి ప్రకాష్, ప్రిన్సిపాల్ నాగలక్ష్మిలు అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

అయిజ: రైతులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందని నాయకుడు సంకాపురం రాముడు అన్నారు. సోమవారం ఈస్టర్ పండుగను పురస్కరించుకొని పట్టణం రైతు సంబరాలు (బండలాగు పోటీలు) ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో ప్రభుత్వాలు వ్యవసాయం దండగా అన్నారని తెలంగాణ ప్రభుత్వ ఏర్పడ్డాక రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండగలా చేస్తున్నారన్నారు. రైతులకు రైతు బంధు, రైతుబీమా, ఉచిత కరెంట్ అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న రాముడు

పేకాట రాయుళ్ల అరెస్టు

గద్వాల క్రైం: పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడులు చేసి అయిదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ ఎస్ఐ అబ్దుల్‌షకుర్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో పట్టణంలోని కృష్ణరోడ్డు సమీపంలోని బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సిబ్బంది సహాయంతో స్థావరంపై దాడులు చేపట్టి అయిదుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.6300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అయిదుగురిపై కేసులు నమోదు చేశారు.

మొబైల్ షాపులో చోరీ

గద్వాల క్రైం: గుర్తు తెలియని దుండగులు మొబైల్ షాపులో చోరబడి మూడు సెల్‌ఫోన్స్, నగదు అపహరించిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసుల వివరాల ప్రకారం గద్వాల బస్టాండ్ వెలుపల మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. తిరిగి ఉదయం వచ్చేసరికి స్వెట్టర్ తెరిచి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు దుకాణ యజమాని శివారెడ్డి సమాచారం ఇచ్చాడు. దుకాణంలో రూ. 40 వేల విలువగల మూడు సెల్‌ఫోన్స్, రూ. 3 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'అకస్మాత్తుగా చెలరేగిన మంటలు'

గద్వాల క్రైం: గద్వాల పట్టణంలోని నల్లసోమనాద్రి కోట ప్రహరీ వద్ద ఉన్న ముళ్లపొదల నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. సోమవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా ముళ్ల పొదాలు అంటుకొని మంటలు చెలరేగాయి. స్థానికుల కథనం మేరకు కొన్ని రోజుల కిందట కోట ప్రహరీ వెంట పెరిగిన ముళ్ల పొదాలను స్థానికులు తొలగించారు. వీటిపై గుర్తు తెలియని వ్యక్తి సిగరేట్ తాగి వీటిపై పడేయడంతో మంటలు చెలరేగినట్లు తెలిపారు. స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఎలాంటి ఆస్తి నష్టం చోటు చేసుకోక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

'కార్పస్ చెట్లను తొలగించాలి'

అలంపూర్ రూరల్: మానవ ఆరోగ్యానికి ప్రమాదకరమైన కోన కార్పస్ చెట్లను తొలగించాలని జెడ్పీటీసీ షంషాద్ ఇస్మాయిల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వివిధ గ్రామాలలో హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన కార్పస్ చెట్లను తొలగించాలని కోరారు. ఈ చెట్లతో ఆరోగ్య సమస్యలు తలెత్తున్నాయని శ్వాస, చర్మవ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే మొక్కలు తొలగించాలని కోరారు.

హెచ్‌ఎంపై సర్పంచ్ ఫిర్యాదు

ఉండవెల్లి: మండలంలోని మారమునగాల-2 గ్రామ పంచాయతీ సర్పంచ్ వీరపోగు సునీత 2021 వ సంవత్సరం నవంబర్ నెల 7వ తేదీన పాఠశాలను సందర్శించింది. పరిసరాలను సర్పంచ్ పరిశీలిస్తుండగా హెచ్‌ఎం షేక్ సర్దార్ బాషా అకారణంగా దూషించి అవమానించాడు. అప్పట్లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయ సిబ్బందికి సర్పంచ్ హెచ్‌ఎంపై ఫిర్యాదు చేయగా విచారణ చేశారు. ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో సోమవారం పోలీస్‌స్టేషన్‌లో సర్పంచ్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు హెచ్‌ఎం షేక్ సర్దార్ బాషాపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ అయ్యన్న తెలిపారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో మొదటి, రెండో తరగతి విద్యార్థులకు పైలేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం రక్త పరీక్షలు నిర్వహించినట్లు వైద్య సిబ్బంది పేర్కొన్నారు. ఆయా తరగతుల్లో 50 మంది విద్యార్థుల నుంచి రక్త నమూనాలను సేకరించామని తెలిపారు. ఈ సర్వే వల్ల పిల్లల్లో మైక్రో పైలేరియా వృద్ధి ఏవిధంగా ఉందో తెలుసుకునే అవకాశం ఉందన్నారు. దీంతో పైలేరియా నివారణ కార్యక్రమాన్ని సంపూర్ణంగా విజయవంతం చేయగలుతామన్నారు. వైద్యాధికారి రాజశేఖర్, శ్రీనివాస్, వెంకటేష్, జహంగీర్, హెచ్‌ఎం పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

మల్దకల్: ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి బింగిదొడ్డి కమిటీ అధ్యక్షుడు లక్ష్మన్ అన్నారు. సోమవారం మండలంలోని మల్లెందొడ్డిలో ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరులు రాసిన ఆధ్యాత్మిక, త్రైతసిద్ధాంత గ్రంథాల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కుల మతాలను రూపుమాపేందుకు, అసమానతలు దూరం చేసేందుకు భగవద్గీత గ్రంథం దోహదం చేస్తుందన్నారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగ అధ్యాయనంలో శ్లోకాలు త్రైతసిద్ధాంతానికి ఆధారమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులు వెంకటేష్, పరుషరాముడు, రామచంద్ర, ఈరన్న, నర్సింహులు, శ్రీనాథ్ శివ, నాని, నాగవేణి, రాజేశ్వరి, పద్మమ్మ, సుభద్రమ్మ, అనంతమ్మ, జమ్ములమ్మ, నర్సమ్మ, దీపిక, పార్వతమ్మ, జ్యోతి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

కొనసాగుతున్న కంటి వెలుగు

మానవపాడు: మండలంలోని పెద్దపోతులపాడు, ఏ బూర్దిపాడు గ్రామాలలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమం డాక్టర్ యాకుబ్‌బాషా, డాక్టర్ హేమ మానస ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపోతులపాడు 173మందికి మందికి కంటి పరీక్షలు, 23 మందికి అద్దాలు, 16 మందికి అద్దాల కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరు పాక్షిరెడ్డి, ఎంపీటీసీ భారత్‌సింహారెడ్డి, చంద్రన్న, వెంకటేశ్వరచారి, పంచాయతీ కార్యదర్శి రాధికా, శ్రావణి, లక్ష్మీనారాయణ, శారద, చిట్టెమ్మ, పుష్పలత, అనసూయమ్మ, సులోచన, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి, చాగదొన గ్రామాల్లో కంటి వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. రెండు గ్రామాల్లోని మొత్తం 298 మందికి కంటి పరీక్షలను నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. 15 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయగా, 29 మందికి కంటి అద్దాల కోసం రెఫర్ చేసినట్లు తెలిపారు. వైద్యాధికారులు తిమ్మప్ప, నర్సింహులు, సీహెచ్‌ఓ ఊసేని, సూపర్‌వైజర్ స్వర్ణలత, ఏఎన్‌ఎంలు సాలమ్మ, విఘ్నేశ్వరి, జయమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఏ.బూర్దిపాడులో కంటి పరీక్ష నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కళాకారులు అధిక సంఖ్యలో తరలిరావాలి

అయిజ: మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించనున్న బీసీ యోధులు పాట ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని తెలంగాణ సాంస్కృతిక సారథి, కవి, గాయకుడు రేలారే ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మొత్తం 11 చరణాలు, 21 మంది బీసీ యోధులు, 11 నిమిషాల నిడివితో కూడిన అరుదైన పాటను ఆవిష్కరిచేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయగౌడ్, మంత్రి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రెటరీ వెంకటేష్, పార్లమెంట్ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సినీ రచయిత సుద్దాల అశోక్ తేజలు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. రేలారే ప్రసాద్ అయిజ మండలం మేడికొండ వాసి కావడంతో ఈ ప్రాంతం నుంచి కవులు, కళాకారులు, సంఘ సంస్కర్తలు అధిక వెళ్లేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు

గద్వాల రూరల్: అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని బీఎస్ కేశవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని అన్ని వార్డులో సమావేశాలు నిర్వహించారు. సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను రీవెరిఫికేషన్ చేసి అర్హులను ఎంపిక చేయాలన్నారు. ఈ జాబితా నుంచి లక్కీ డిప్ ద్వారా అర్హులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో విచారణ అధికారి శ్వేతాప్రియదర్శిని, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

గొర్రెల పంపిణీకి అర్హుల గుర్తింపు



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ

కేటీదొడ్డి: మండలంలోని రెండో విడత గొర్రెల పంపిణీకి అర్హులను అధికారుల గుర్తిస్తున్నారు. సోమవారం ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహిద్దీన్ ఆధ్వర్యంలోని మండల కేంద్రంలోని అర్హుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభించారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేకరించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. చనిపోయిన వారు ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నవారు శాశ్వతంగా గ్రామం వదిలి వెళ్లిన వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రంగన్న, కుర్వ సంఘం సభ్యులు విష్ణు, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

మదనాపురం: మండలంలోని నెల్విడిలో సోమవారం హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్ కుమార్‌గౌడ్ ఉపాధి హామీ కూలీలను కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే స్థలం ఉన్న ప్రతి ఒక్క నిరుపేదకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థికసాయం చేసి ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామన్నారు. రూ.500 వందలకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం అందచేస్తామని తెలిపారు. రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రైతు రుణ మాఫీ, వరి పంటకు మద్దతు ధర రూ.2,500 కల్పిస్తామని హామీ ఇచ్చారు. కౌలు రైతులకు ఏడాదికి రూ.15 వేలు, భూమి లేని ఉపాధి కూలీలకు ఏడాది రూ.12 వేలు సహాయం చేస్తామని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు అంజాద్ అలీ, మహేష్, రామచంద్రయ్య, విజయ్, రాములు, మల్లేష్, తిరుపతి నాయక్, వెంకటేష్, రామన్‌పాడ్ ఖాదీర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాటం ప్రదీప్‌కుమార్

నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలి

పాన్‌గల్: వివిధ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకున్న నిరుద్యోగులందరికీ వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ కుతుబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కేతేపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ 2018 ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి నెలకు రూ.3,116 ఇస్తామని ప్రకటించిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీని అమలు ఇప్పుడు, అప్పుడు అంటూ కాలయాపన చేస్తూ నిరుద్యోగులను మోసం చేస్తుందని దుయ్యబట్టారు. ఉద్యోగాలకు సిద్ధమవుతున్న తరుణంలో పేపర్ల లీకేజీతో ఉద్యోగ పరీక్షల రద్దు కారణంగా నిరుద్యోగులు నైరాశ్యంలో మునిగిపోయారని వాపోయారు. ఉద్యోగ పరీక్షలు ఎప్పుడు జరుగుతాయో, భర్తీ ఎప్పుడు చేస్తారో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఉద్యోగాలను భర్తీ చేసే వరకు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇచ్చి వారిని ఆదుకోవాలని కోరారు. పేపర్ల లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్, సభ్యులు రామాంజనేయులు, సీపీఐ మండల కార్యదర్శి కుర్మయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎండీ కుతుబ్

వసతులు కల్పించాలి

అమరచింత: ఈనెల 22న జరిగే రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గాలో వసతులు కల్పించాలని పట్టణ జామియా మజీద్ సదర్ కమిటీ ఆధ్వర్యంలో పుర చైర్మన్ మంగమ్మ, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజాలకు వినతిపత్రం అందించారు. ఈమేరకు కమిటీ సభ్యులు మాట్లాడుతూ రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాకు ఇరువైపులా రహదారులు పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. తాగునీటి వసతి, కరెంటు సౌకర్యం కల్పించాలన్నారు. పవిత్ర నమాజ్‌లో పాల్గొనే ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేసి వేసవి ఎండల నుంచి ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

